పోర్టిఫైడ్ ఎంతో పౌష్టికం

- గర్భిణులు, బాలింతలకు బలవర్ధకమైన ఆహారం
- పోషకాహార లోపాల నివారణకు ప్రభుత్వం చర్యలు

చిత్తూరు రూరల్: పోషకాహార లోపాన్ని నివారించేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. మాతాశిశు మరణాల నియంత్రణ, పిల్లల ఎదుగుదలపై దృష్టి సారించిన ప్రభుత్వం పోర్టిఫైడ్ రైస్ సమస్యకు చెక్ పెడుతోంది. పోషకాహారం తీసుకోవడంపై గర్భిణులు, బాలింతలు ఆసక్తి చూపకపోవడంతో శిశువుల ఎదుగుదల లోపాలకు, మరణాలకు కారణమవుతోంది. ఆరోగ్య పరమైన అనేక సమస్యలకు పరిష్కారంగా పోర్టిఫైడ్ రైస్‌ను ప్రభుత్వం అందజేస్తోంది. ఈ బియ్యం అందుబాటులోకి వచ్చి నెలలు గడిచినా ఇప్పటికీ వినియోగంపై అపోహలు ఉన్నాయి. వాటిని తొలగించేందుకు అంగన్‌వాడీ సిబ్బంది కృషి చేస్తున్నారు.

పోర్టిఫైడ్ బియ్యం అంటే....

పోర్టిఫైడ్ రైస్‌ను వాడుక భాషలో బలవర్ధక బియ్యంగా పిలుస్తారు. సాధారణ బియ్యానికి ఈ బియ్యానికీ అనేక అంశాల్లో సారూప్యత ఉంది. వాటితో పోల్చుకుంటే బలవర్ధక బియ్యంలో పోషకాలు మెండు. పోషకాలను బియ్యం రూపంలో మార్చి ప్రత్యేక గింజలుగా తయారు చేసి సాధారణ బియ్యంలో కలుపుతారు. వీటిని జతచేసి పంపిణీ చేస్తారు. ఈ కృత్రిమ బియ్యాన్ని కెర్నల్ అంటారు. ఫుడ్‌సేఫ్టీ అండ్ స్టాండర్స్ అథారిటీ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం ప్రతి వంద కిలోల బియ్యానికి వ్యక్తి ఆరోగ్య స్థితి అవసరాన్ని బట్టి ఒక కిలో లేదా రెండు కిలోల ఈ కెర్నల్స్‌ను కలుపుతారు.




పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న దృశ్యం(ఫైల్)

ప్లాస్టిక్ బియ్యం కాదు

పోర్టిఫైడ్ రైస్ ప్రాధాన్యతను గుర్తించక పలువురు గర్భిణులు, బాలింతలు ప్లాస్టిక్ రైస్‌గా అపోహ పడుతున్నారు. సాధారణంగా సంతులిత పోషకాలతో నిండిన కృత్రిమ బియ్యానికి ప్రత్యేక గుణముంది. తయారీ ప్రక్రియలో పోషకాల చేరికలోని హెచ్చు తగ్గుల కారణంగా, వాటిలో కొన్ని నీటిలో తేలే గుణాన్ని కలిగి ఉంటాయి. అలా తేలిన బియ్యాన్ని ప్లాస్టిక్ బియ్యంగా భ్రమ పడుతున్నారు. ఇవి ప్లాస్టిక్ బియ్యం కాదని భద్రంగా వినియోగించుకోవచ్చంటూ నిపుణులు చెబుతున్నారు.

ఇలా వండుకుంటే మేలు....

- బలవర్ధక బియ్యంలో జతచేర్చిన పోషకాలను కోల్పోకుండా ఉండాలంటే ప్రత్యేక వంట విధానాన్ని అవలంబించాలి.
- పోర్టిఫైడ్ రైస్ ఎక్కువగా నీటితో రుద్ది శుభ్రం చేయకూడదు.
- వండే ముందు కొంత సేపు నీటిలో ఉంచి ఆ నీటిని తీసేయాలి. అవసరమైతే మరో మారు రుద్దకుండా మంచినీటితో శుభ్రం చేసుకోవచ్చు.
- అన్నం వండేటప్పుడు నెయ్యి, దాల్చిన చెక్క, జీలకర్ర, యాలకలు, లవంగాలు వంటి దినుసులు జోడిస్తే మంచి ఫలితాలు ఉంటాయి.
- పోర్టిఫైడ్ రైస్‌లో పోషకాలు మరింత ద్విగుణీకృతం చేసేందుకు సగం నీరు, సగం పాలు కలిపిన ద్రవంలో ఉడికిస్తే మేలు. - పిల్లలకు ఈ విధానం మరింత బలవర్ధకం.
- పోర్టిఫైడ్ బియ్యాన్ని ఎప్పుడూ మూత పెట్టి ఉడికించాలి. తెరిచిన పాత్రలో వండితే పోషకాలు ఆవిరవుతాయి.
- అల్యూమినియం కుక్కర్లకు బదులుగా స్టీలు, గాజు, మట్టి పాత్రల్లో వండటం పోషకాల నిలుపుదలకు దోహదపడతాయి.

గర్భిణుల్లో అవగాహన పెరిగింది



పోర్టిఫైడ్ బియ్యాన్ని ప్లాస్టిక్ బియ్యంగా భ్రమపడి వినియోగించడం మానేసిన దాఖలాలు ఇప్పుడు లేవు. అంగన్‌వాడీ కార్యకర్తల కృషి సత్ఫలితాల నిచ్చింది. గర్భిణులు, బాలింతల్లో అవగాహన పెరిగింది. ఇవే బియ్యాన్ని సామాన్య ప్రజలకూ పంపిణీ చేస్తోంది. ఈ బియ్యం ఏడాది పాటు పాడవకుండా ఉంటాయి. పంపిణీలో నాణ్యత పెంచేలా కొద్ది రోజుల నుంచి మూడు కిలోల బియ్యం అందజేస్తోంది.

– శ్యాంసుగుణకుమారి, సీడీపీఓ, చిత్తూరు

తయారీ ఇలా...

- శాస్త్రీయ విధానంలో సిద్ధంచేసిన విటమిన్లు, సూక్ష్మపోషకాల మిశ్రమాన్ని పిండి రూపంలో చేసి బియ్యం పిండితో కలిపి ఎక్స్‌ట్రూడర్ యంత్రంలోకి ప్రవేశ పెడతారు.
- కొంత సమయం తర్వాత ప్రత్యేక ప్రక్రియ ద్వారా పిండి మిశ్రమం గింజలుగా మారుతుంది.
- అచ్చం బియ్యం ఆకారంలో ఉండే వీటి పొడవు గరిష్టంగా 5 మిల్లీ మీటర్లు, వెడల్పు 2 మిల్లీ మీటర్లు.
- సాధారణ బియ్యానికి సరిసమానమైన కొలతలతో సిద్ధమవుతాయి.
- వీటినే శాస్త్రీయంగా పోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్ అంటారు.
- తదుపరి ప్రక్రియలో భాగంగా వంద కిలోల బియ్యానికి గరిష్టంగా రెండు కిలోల చొప్పున బ్లెండర్ యంత్రంలో వేస్తారు.
- సిద్ధమైన బలవర్ధక బియ్యాన్ని ప్రత్యేక ప్యాకెట్లలో సిద్ధం చేస్తారు.
- పోర్టిఫైడ్ బియ్యం ప్యాక్‌చేసిన ప్రతి ప్యాక్‌పై ఎఫ్ అనే ప్రత్యేక గుర్తును ముద్రిస్తారు.

క్లుప్తంగా

'రూల్స్ రంజన్' సందడి


థియేటర్ వద్ద నటుడితో అభిమానులు

చిత్తూరు రూరల్: యువ నటుడు కిరణ్ అబ్బవరం నటించిన రూల్స్ రంజన్ చిత్రం శుక్రవారం విడుదల అయింది. ఈ చిత్రంలో ఎమ్మెల్యే పాత్రలో నటించిన చిత్తూరు కుర్రాడు తేజ చిత్తూరు నగరంలోని ఓ థియేటర్ వద్ద సందడి చేశారు. ప్రేక్షకులు, కుటుంబ సభ్యులతో సినిమాను వీక్షించారు. అనంతరం చిత్తూరు కుర్రాడు మాట్లాడుతూ తాను కిరణ్ అబ్బవరంతో నటించిన ఏడవ చిత్రం అని, ఈ సినిమాను విజయవంతం చేసిన ప్రేక్షకులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

ఫీజుల దోపిడీ అరికట్టాలి


డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆ సంఘం నాయకులు శుక్రవారం డీఈవో విజయేంద్రరావుకు వినతిపత్రం అందజేసి పలు డిమాండ్లపై చర్చించారు. జిల్లాలోని నారాయణ, శ్రీచైతన్య పలు పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా టెక్నో, ఒలంపియాడ్, ఐఐటీ, జేఈఈ పలు కోచింగ్‌లు ఇస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల నుంచి అధికంగా ఫీజులు వసూళ్లు చేసి మోసం చేస్తున్నారన్నారు. పలు పాఠశాలల్లో వసతిగృహాలకు అనుమతులు లేకున్నా నిర్వహిస్తున్నారని తెలిపారు. విచారణ చేపట్టి ప్రభుత్వ నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డీఈవోను కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రోహిత్, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ఆంధ్రాకు జగన్ ఎందుకు కావాలి'పై అవగాహన

గుడిపాల: 'ఆంధ్రాకు జగన్ ఎందుకు కావాలి' కార్యక్రమం శనివారం ఉదయం 9:30 గంటలకు ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండలంలోని గృహసారథులు, వలంటీర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ తప్పకహాజరు కావాలని ఆయన తెలియజేశారు.

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన

ఐరాల: విద్యార్థులు వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కలిగి ఉండాలని మండల అటవీశాఖాధికారి జయశంకర్ అన్నారు. మండలంలోని పొలకల జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం హెచ్ఎం శాంతకుమారి ఆధ్వర్యంలో వన్యప్రాణుల వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జయశంకర్ మాట్లాడుతూ వన్యమృగ సంరక్షణ, అడవుల పరిరక్షణపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎఫ్‌బీఓలు లావణ్య, రెడ్డిప్రసాద్, శ్రీదేవి, శంకరప్ప పాల్గొన్నారు.

అడవులను రక్షించుకుందాం


విజేతలకు బహుమతులు పంపిణీ చేస్తున్న ఎఫ్ఎస్ఓ జయశేఖర్

తవణంపల్లె: అడవుల రక్షణకు అందరూ సహకరించాలని గాజులపల్లె ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ కె.జయశేఖర్ అన్నారు. వన్యప్రాణుల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని కృష్ణాపురం ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వన్య ప్రాణుల రక్షణపై విద్యార్థులకు వ్యాసరచన, చిత్ర లేఖన పోటీలు నిర్వహించి, బహుమతులందజేశారు. కార్యక్రమంలో గాజులపల్లె ఎఫ్‌బీఓ నరేష్, మాధవరం ఎఫ్‌బీఓలు సాయినాథ్, సురేంద్ర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువమోర్చా అధ్యక్షుడిగా దామోదర్‌రెడ్డి



చిత్తూరు కార్పొరేషన్: బీజేపీ యువజన విభాగం యువ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా చిత్తూరు నగరానికి చెందిన దామోదర్‌రెడ్డిని నియమించారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఏబీవీపీ రాష్ట్ర నాయకుడిగా, యువమోర్చా విభాగం రాష్ట్ర మీడియా ఇన్‌చార్జిగా దామోదరరెడ్డి పనిచేశారు.

ఉత్సాహంగా సీనియర్ సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక


ఎంపికైన క్రీడాకారులతో హెచ్‌ఎం కోమల, పీడీలు

ఐరాల: ఉమ్మడి చిత్తూరు జిల్లా సీనియర్ సాఫ్ట్‌బాల్ బాల, బాలికల జట్ల ఎంపికలు శుక్రవారం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారని హెచ్ఎం కోమల తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌యాదవ్, కార్యదర్శి రమేష్ వెల్లడించారు. ఎంపికైన క్రీడాకారులు కర్నూలు జిల్లా ఆళ్లగడ్డలో నిర్వహించే రాష్ట్రస్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీడీలు దేవా, గురుప్రసాద్, లోకేష్, సుబ్రమణ్యం, శశి, అమరావతి పాల్గొన్నారు.

ఎంపికైన సీనియర్ బాలుర జట్టు

లోకేష్, సూర్య, రోహిత్, విజయ్, తరుణ్, మునిరాజ, శివ, పువికుమార్, విజయ్, వేణుగోపాల్, మోహిత్‌సాయి, హేమసాగర్, నవీన్, విష్ణు, ముఖేష్, ప్రవీణ్

సీనియర్ బాలికల జట్టు

భూమిక, చందన, తేజ, పల్లవి, మైదిలి, దయనేశ్వరీ, శ్రావణి, రూప, హేమలత, ఇంద్రజ, నవ్య, ఇందు ఎంపికయ్యారు.

ముక్కంటి సేవలో కాణిపాకం ఆలయ చైర్మన్


ఆలయంలో మోహన్‌రెడ్డి, కుటుంబ సభ్యులు

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి వారిని శుక్రవారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ధర్మకర్తల మండలి తాజా మాజీ చైర్మన్ మోహన్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం అందించారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపికతోపాటు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నాడు–నేడు పనులను పూర్తి చేయాలి



పుణ్యసముద్రం పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ హేమలత

తవణంపల్లె: నాడు–నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఈఓ హేమలత తెలిపారు. మండలంలోని ఐరాల క్రాస్, పుణ్యసముద్రం పాఠశాలలను శుక్రవారం సందర్శించారు. ఐరాల క్రాస్ రోడ్డులో నాడు–నేడు నిధులతో చేపడుతున్న తరగతి భవనం నిర్మాణ పనులను పర్యవేక్షించారు. పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం పుణ్యసముద్రం పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. ప్రతి విద్యార్థి చదవడం, రాయడం నేర్పించాలన్నారు. ఎంఈఓతో పాటు ప్రధానోపాధ్యాయులు సుధాకర్ రెడ్డి, శోభారాణి, సీఆర్‌పీ గోపి పాల్గొన్నారు.

20 వరకు విధుల బహిష్కరణ

చిత్తూరు అర్బన్: చిత్తూరులో న్యాయవాదులు శుక్రవారం నుంచి విధులను బహిష్కరించారు. న్యాయస్థానాల్లో దాఖలుచేసే పిటిషన్లపై రూ.1 స్టాంపునకు బదులు రూ.20 స్టాంపులు వేయాలనే రాష్ట్ర బార్ కౌన్సిల్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు చిత్తూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజేంద్రరెడ్డి, అశోక్ ఆనంద్ యాదవ్ ఓ ప్రకటనలో తెలిపారు. దీన్ని నిరసిస్తూ ఈనెల 20వ తేదీ వరకు న్యాయవాదులు విధులు బహిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు


కుండపై కళాకారిణి నాట్యం

కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ప్రత్యేక ఉత్సవాల్లో శుక్రవారం ఆలయ ఆస్థాన మండపంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు కళాకారులు ప్రదర్శించిన భరతనాట్యం, కూచిపూడి నృత్యాలు భక్తులను విశేషంగా అలరించాయి. ఆలయ తాజామాజీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన కళాకారులను అభినందించారు.

– కాణిపాకం(యాదమరి)


వినాయక వేషధారితో నాట్యం చేస్తున్న కళాకారిణి


శ్రీకృష్ణ రాయబారం నాటికలో ఓ దృశ్యం

అందరికీ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

బంగారుపాళెం: అందరికీ ఆరోగ్యం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ అన్నారు. మండలంలోని కాటప్పగారిపల్లె ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరాన్ని ఎంపీపీ అమరావతి ప్రారంభించారు. వైద్య శిబిరంలో 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

పేదలకు ఆరోగ్య రక్ష

చిత్తూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఆరోగ్య రక్షగా ఉంటూ వైద్య సేవలకు పెద్ద పీట వేస్తోందని జెడ్పీటీసీ సభ్యుడు ఎం.ఎస్ బాబునాయుడు అన్నారు. చిత్తూరు నగరం తాళంబేడు సచివాలయం వద్ద శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్‌క్యాంపును నిర్వహించారు. ఇద్దరు స్పెషలిస్టు డాక్టర్లు, మరో ఇద్దరు మండల వైద్యాధికారులు, 10 మంది వైద్య శిబిరంతో క్యాంపును ప్రణాళిక ప్రకారం చేపట్టారు. ఉదయం 9 గంటలకే జనం క్యూకట్టారు. విభాగాల వారీగా వైద్యులతో చికిత్స చేయించుకున్నారు. అనంతరం కళ్ల అద్దాలు పంపిణీ చేశారు.

సురక్ష..ప్రజల ఆరోగ్యానికి రక్ష

ఐరాల: జగనన్న ఆరోగ్య సేరక్ష కార్యక్రమం ప్రజల ఆరోగ్యానికి రక్షణగా నిలుస్తోందని వైఎస్ ఎంపీపీ రోజా, ఎం.పైపల్లె సర్పంచ్ జమున అన్నారు. మండలంలోని ఎం.పైపల్లె గ్రామ సచివాలయ ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 388 మందికి స్పెషలిస్ట్ డాక్టర్లు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారంపై ఏర్పాటు చేసిన స్టాల్‌ను ఎంపీడీఓ నాగరాజు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు.



తవణంపల్లె : రోగులకు సేవలందిస్తున్న వైద్యులు, గుడిపాల: కళ్లద్దాలను అందజేస్తున్న ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి

పేదలకు మెరుగైన వైద్యం

తవణంపల్లె: నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ ధ్యేయమని తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి తెలిపారు. మండలంలోని వెంగంపల్లె హైస్కూల్లో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు సి.హరిరెడ్డి, పరిశీలించారు.

అందుబాటులో వైద్యం

పూతలపట్టు: ఆరోగ్య సురక్ష శిబిరంలో రోగులకు సకల వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని ఎంపీడీఓ గౌరి అన్నారు. శుక్రవారం మండలంలోని బైటపల్లి పంచాయతీ మద్దులయ్యగారిపల్లిలో సర్పంచ్ రామతులసీ ఆధ్వర్యంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. ఉచిత కంటి అద్దాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయుష్మాన్ భారత్ యోజన హెల్త్ కార్డులను అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి, అభినందించారు.


పూతలపట్టు: కళ్లద్దాలను, హెల్త్ కార్డులను అందుకున్న రోగులు

ఆరోగ్య సురక్ష.. ఓ సువర్ణాధ్యాయం

గుడిపాల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఓ సువర్ణాధ్యాయమని ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని నంగమంగళం గ్రామంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ కళ్యాణి టీం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపులో ఎంపీపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వైద్య పరీక్షల అనంతరం బాధితులకు జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను ఆయన పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో 264మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు.

సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా సంతోషం

- పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు
- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి 200 రోజులు
- ఎర్రేపల్లిలో సచివాలయ భవనం ప్రారంభం



కోళ్లపల్లెలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఐరాల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా సంతోషం నెలకొందని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మండలంలోని కోళ్లపల్లె, కమతంపల్లె, రామవనం, చెంగనపల్లె, రత్నగిరి, కమతంపల్లె దళితవాడ, చెంగనపల్లె దళితవాడలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. 482 కుటుంబాలతో మమేకమయ్యారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు వివరిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పథకాలు ప్రజలకు అందుతున్న తీరు, అందిన సాయాన్ని వివరించారు. ప్రజల సమస్యలు విని వాటి పరిష్కారిస్తామన్నారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను అందించి వారితో ఆప్యాయంగా మాట్లాడారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

సీసీ రోడ్లు వేయాలని, ఇంటి పట్టాలు ఇవ్వాలని, కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, మురుగు కాలువలు నిర్మించాలని, పింఛన్లు మంజూరు చేయాలని, భూ సమస్యలు పరిష్కరించాలని, కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని తదితర సమస్యలను ఆయా గ్రామస్తులు ఎమ్మెల్యేకు నివేదించారు. ఆయా సమస్యలను అధికారులు పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

ఎర్రేపల్లె సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముగియడంతో సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఎవరూ అలసత్వం ప్రదర్శించొద్దని ఆదేశించారు. అభివృద్ధి పనులను చేపట్టేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

ఇది ఓ బృహత్తర కార్యక్రమం

ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకునేందుకు ప్రారంభించిన గడప గడపకూ మన ప్రభుత్వం ఓ బృహత్తర కార్యక్రమమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం 200 రోజులు పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే ఐదు మండలాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి కేక్ కట్ చేసి నాయకులకు, కార్యకర్తలు పంచిపెట్టి, సంబరాలు జరుపుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 2021వ సంవత్సరం మేలో ఐరాల మండలం నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభమైనదని, నేటితో మండలంలోనే 200 రోజులు పూర్తికావడం సంతోషంగా ఉందన్నారు. నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 83,274 కుటుంబాలతో మమేకమై, వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించినట్లు చెప్పారు. దీనికి కృషి చేసిన అధికారులకు, నాయకులకు, ప్రజలకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు.

సచివాలయ భవనం ప్రారంభం

గ్రామస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సేవలు చేరువచేయడం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మండలంలోని ఎర్రేపల్లె నూతన గ్రామ సచివాలయ భవనాన్ని శుక్రవారం స్థానిక సర్పంచ్ తులసీప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ ప్రభాకర్‌రెడ్డి, నాయకులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి, ఎంపీపీ మోహన్, తవణంపల్లె ఇన్‌చార్జి ఎంపీపీ పట్నం ప్రతాప్‌రెడ్డి, జిల్లా వైఎస్సార్‌సీపీ సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్ రెడ్డి, జిల్లా యువత ఉపాధ్యక్షుడు మహేంద్ర, పూతలపట్టు మండల సచివాలయ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, నియోజకవర్గ, మండల యువత అధ్యక్షులు సాయిరెడ్డి, భార్గవ్‌రెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు డిల్లీప్రతాప్, కాణిపాకం సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, కోళ్లపల్లె ఉప సర్పంచ్ సదాశివ, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజారత్నంరెడ్డి, చలపతిరెడ్డి, చిన్నారెడ్డి, పరమేశ్వర్ రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సుధీర్ పాల్గొన్నారు.

సస్యరక్షణ పద్ధతులతో రైజోమ్ వావిల్ నివారణ

గుడిపాల: అరటిలో సమగ్ర సస్యరక్షణ పద్ధతుల ద్వారా రైజోమ్ వావిల్ పురుగును నివారించవచ్చని ఏరువాక కేంద్రం చిత్తూరు కో–ఆర్డినేటర్ డాక్టర్ రెడ్డిరాము, విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర, చిత్తూరు డీఆర్‌సీ వ్యవసాయాధికారి పద్మజ తెలిపారు. మండలంలోని పాపసముద్రంలో శుక్రవారం అరటి, బొప్పాయి, కందిపంటలను వారు పరిశీలించారు. అరటిలో రైజోమ్ వావిల్ పురుగు(తెల్లపురుగు) నివారణకు సూచనలు చేశారు. అరటి మొక్కను నాటే ముందు అరటి సక్కర్‌ను 0.1 శాతం క్లోరిపైరిపాస్ లేదా క్వినాల్‌ఫాస్ ద్రావణంలో ముంచి నాటాలన్నారు. మొక్క ఎదిగిన దశలో కాండం మీద రంధ్రాలు చేసుకొని లోపలి గుజ్జు అంతా తినడం వల్ల మొక్క కుళ్లిపోయి చనిపోతుందన్నారు. దీని నివారణకు మొక్క మొదళ్లవద్ద కార్బోఫ్యూరాన్ గుళికలు చెట్టుకు పదిగ్రాములు, మరియు వేపపిండి 50 గ్రాములు కలిపి పెట్టాలన్నారు. వ్యవసాయాధికారి మాధవి, రైతుభరోసా కేంద్రం సిబ్బంది తులసిరాంరెడ్డి పాల్గొన్నారు.


అరటి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు